సాక్షి నిజామాబాద్

ఆదివారం । 22 । జూన్ । 2025



అటవీశాఖ అధికారుల పై..

ధర్పల్లి మండలం కొటాల్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి అటవీశాఖ అధికారులపై పలువురు గిరిజనులు దాడి చేశారు.

- 8లో ▸



కార్పొరేట్ కంపెనీలకు..

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని టీయూసీఐ జాతీయ అధ్యక్షుడు అభ్రిష్ విమర్శించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2 /23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఘనంగా యోగా డే

- ఆయూష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కార్యక్రమం
- పాఠశాలల్లో యోగాసనాలు వేసిన విద్యార్థులు



బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని శ్రీరామగార్డెన్స్‌లో యోగా సాధన చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, సీపీ సాయిచైతన్య, తదితరులు





అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు. తనువు, మనసు, ఆత్మను ఏకం చేసే సాధనమే యోగా అని, యోగా మన ప్రాచీన సంప్రదాయం నుంచి వచ్చిన ఒక అమూల్యమైన బహుమతి అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా ఆయూష్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌తోపాటు సీపీ సాయి చైతన్య, జిల్లా అధికారులు పాల్గొని ఆసనాలు వేశారు. మోర్తాడ్‌కు చెందిన చిత్రకారుడు మోత్కురాము రావి ఆకును యోగాసన చిత్రంగా కట్ చేశాడు. – నిజామాబాద్‌నాగారం

న్యూస్‌రీల్

రైతుల ఖాతాల్లో రూ.287.78 కోట్లు జమ

నిజామాబాద్‌అర్బన్: రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం శనివారం వరకు జిల్లాలోని 2,63,413 మంది రైతుల ఖాతాల్లో రూ.287.78 కోట్ల నిధులు జమయ్యాయని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట పెట్టుబడి సాయం కింద జిల్లాలో మొత్తం 2,98,472 మంది రైతులకు రూ.326.03 కోట్ల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. తాజాగా శనివారం 8208 మంది రైతుల ఖాతాల్లో రూ.27.97 కోట్లు జమయ్యాయని వివరించారు.

బ్రాండ్ సంపాదించుకోవాలి



నిజామాబాద్ సిటీ: మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, వీధివిక్రయదారులు, సమాఖ్య సభ్యులు తాము తయారు చేస్తున్న ఆహార పదార్థాల్లో నాణ్యత పాటిస్తూ వాటికి ప్రత్యేక బ్రాండ్ సంపాదించుకోవాలని, తద్వారా మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో ఆయన పాల్గొన్నారు. 100 రోజుల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో 'ఫుడ్ ఫెస్టివల్' స్టాల్స్ ఏర్పాటు చేశారు. దాదాపు 42 స్టాల్స్‌ను మెప్మా పీడీ రాజేందర్‌తో కలిసి కమిషనర్ పరిశీలించి వంటలను రుచిచూశారు. నగరంలోని కొన్ని సూపర్‌బజార్లతో టైఅప్ కావాలని సూచించారు. రూ.10లక్షల కన్నా ఎక్కువ రుణాలు పొంది పెద్ద ఎత్తున తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. పీడీ రాజేందర్, మెప్మా అధికారిణి మాధురి, టౌన్ ప్రాజెక్ట్ అధికారి రమేశ్, పడాల గోవర్ధన్‌గౌడ్, సీవోలు అశోక్, సంతోష్, ఆర్పీలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగోరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశానికి బాలబాలికలకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత వారి ఆదాయం రూ.2 లక్షలకు మించొద్దని స్పష్టం చేశారు. తోటి, చెంచు, గిరిజన ఆదిమతి తెగల విద్యార్థులు సైతం అర్హులని, వీరికి రెండు సీట్లు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశారు. విద్యార్థులు ఈనెల 23వ తేదీ నుంచి తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మిగతా వివరాలకు 99120 86022 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

26న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజారాం స్టేడియంలో ఈనెల 26వ తేదీన అండర్ - 10, 12, 14 బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 20 మంది బాలబాలికలను జూలై 6వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అత్యధిక పతకాలు సాధించిన పాఠశాలలకు ప్రతి ఏజ్ గ్రూప్‌లో బాలుర, బాలికల విభాగాల్లో వేర్వేరుగా ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలతో పాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేస్తామని తెలిపారు. 25న సాయంత్రం 5 గంటలలోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకొని వారికి డైరెక్ట్ ఎంట్రీ ఉండదని, ఇతర వివరాలకు 99890 40776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సరదాగా స్కిల్స్..

విద్యా సంవత్సరం అంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఎంజాయ్‌మెంట్ గుర్తుకొస్తుంది. ప్రస్తుతం ట్రెండ్ మారింది. పిల్లలతోపాటు తల్లిదండ్రులు వేసవి సెలవులను సైతం విలువైన సమయంగా భావిస్తున్నారు. సమయాన్ని వృథా చేయకుండా కొత్త స్కిల్స్ నేర్చుకునేందుకు వినియోగించుకుంటున్నారు. కొంత మంది తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తూ వారికి ఇష్టమైన రంగంలో రాణించేలా తర్ఫీదు ఇప్పిస్తున్నారు. ఈ సంవత్సరం వేసవి సెలవులను ఎలా వినియోగించుకున్నారో పిల్లలు 'సాక్షి'తో వివరించారు. – నిజామాబాద్‌నాగారం

వేసవి సెలవులు వృథా చేయలేదు

- ఉత్సాహంగా శిక్షణ పొందిన విద్యార్థులు
- ప్రోత్సహించిన తల్లిదండ్రులు
- సెలవులు సద్వినియోగం అయ్యాయంటున్న చిన్నారులు

నేను ■ స్కేటింగ్ నేర్చుకున్నా



వేసవి సెలవులను వృథా చేయలేదు. ప్రతి రోజూ మా అన్నయ్య దేవ దీక్షిత్‌తో వెళ్లి ఉదయం, సాయంత్రం స్కేటింగ్ నేర్చుకున్నా. నాకు ఇప్పుడు స్కేటింగ్ పూర్తిగా వచ్చేసింది. స్కేటింగ్ ఇంకా మెరుగైన శిక్షణ తీసుకుంటా. – దేవ సుహాస్, ఆరో తరగతి

చిత్రలేఖనం స్కేటింగ్



నేను మా అక్క, అన్నయ్య బాలభవన్‌కు వెళ్లాం. మొదట్లో చిత్రలేఖనం నేర్చుకున్నా. అటు తర్వాత స్కేటింగ్‌లో శిక్షణ తీసుకున్నా. కొన్ని రోజులు తర్వాత కర్రసాము లో కూడా శిక్షణ తీసుకున్నా. సెలవులు చాలా సరదాగా గడిచిపోయాయి.
– యక్షిత్, 3వ తరగతి

■ క్రికెట్‌లో రాణిస్తున్నా



మూడు సంవత్సరాల నుంచి క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఎక్కడ పోటీలు జరిగినా అక్కడికి వెళ్తున్నా. వేసవి సెలవుల్లో కూడా శిక్షణ తీసుకుని క్రికెట్‌లో మరిన్ని మెలకువలు నేర్చుకున్నా. క్రికెట్‌లో రాణించడం చాలా సంతోషంగా ఉంది. – శివాని, 8వ తరగతి

జిల్లాలో శిక్షణ శిబిరాలు

జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల వేసవిలో ప్రత్యేకంగా క్రీడలు, సంగీతం, డ్యాన్స్, పెయింటింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, క్రికెట్, తదితర క్రీడల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. అలాగే జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో సుమారు 600మందికి పైగా విద్యార్థులకు కర్రసాము, నృత్యం, శ్లోకాల పఠనం, కుట్లు, అల్లికలు తదితర అంశాల్లో ప్రత్యేకంగా 45 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు బాలభవన్‌కు ప్రతిరోజూ ఉదయం 8గంటలకు చేరుకుని మధ్యాహ్నం 2గంటల వరకు శిక్షణ పొందారు. అలాగే స్పోర్ట్స్ గ్రౌండ్స్ బిజీగా మారాయి.



బాలభవన్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

స్విమ్మింగ్ వచ్చింది



సెలవుల్లో సాయంత్రం వేళ ప్రతి రోజూ నాతోపాటు అన్నయ్యను మా అమ్మానాన్న స్విమ్మింగ్‌పూల్‌కి తీసుకెళ్లారు. మొదట్లో చాలా భయపడ్డా. మా అన్నయ్య స్విమ్మింగ్ చేయడం చూసి నేను కూడా నేర్చుకున్నా. కొద్దికొద్దిగా స్విమ్మింగ్ చేస్తున్నా. – ప్రతీక్, 3వ తరగతి

సండే స్పెషల్



బాలభవన్‌లో శిక్షణ అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో కర్రసాము ప్రదర్శిస్తున్న చిన్నారులు(ఫైల్)

ఉదయం కరాటే.. సాయంత్రం స్విమ్మింగ్



సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వెళ్లకుండా ఇక్కడే ఉన్నా. ప్రతిరోజూ ఉదయం కరాటే, సాయంత్రం స్విమ్మింగ్‌లో శిక్షణ పొందా. సెలవులు రోజులు అంతా ఇక్కడే ఉన్నాం. మా నాన్న శిక్షణ ఇప్పించేందుకు ప్రత్యేకంగా నాకు సమయం కేటాయించారు. అందుకే బాగా నేర్చుకున్నా.
– ప్రణయ్, 5వ తరగతి

కర్రసాము నేర్చుకున్నా



నేను, మా అక్క, తమ్ముడు ముగ్గురం కలిసి బాలభవన్‌కు వెళ్లాం. పెయింటింగ్, స్కేటింగ్, డ్యాన్స్ నేర్చుకున్నాం. నేను కర్రసాములో ప్రత్యేకంగా మెలకువలు నేర్చుకున్నా. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున పరేడ్ మైదానంలో మా గురువుతో కలిసి కర్రసాము ప్రదర్శించా. – కార్తికేయ, ఐదో తరగతి

భరతనాట్యం కర్రసాము..



నేను మా తమ్ముళ్లతో కలిసి బాలభవన్‌కు వెళ్లానరు. ముఖ్యంగా డ్యాన్స్, భరతనాట్యం, కూచిపూడితో పాటు కర్రసాములో శిక్షణ తీసుకున్నా. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పరేడ్ మైదానంలో భరతనాట్యం ప్రదర్శించా.
– జి సహస్ర, ఏడో తరగతి

■ బాస్కెట్‌బాల్‌లో శిక్షణ..



చదువుకుంటూనే ప్రతి రోజూ సాయంత్రం సమయంలో బాస్కెట్‌బాల్‌లో గత మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాం. ఈ ఏడాది వేసవి సెలవులు వృథా చేయొద్దని నిర్ణయించుకుని మరింత మెరుగైన శిక్షణ తీసుకున్నాం. సెలవులను వృథా చేయకుండా మరిన్ని మెలకువలు నేర్చుకోవడం ఆనందంగా ఉంది. – నయన్ (8వ తరగతి), జయన్‌సింహా(5వ తరగతి)

క్షయ నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

- కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశాలు
- వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: క్షయ నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి వైద్యారోగ్యశాఖాధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వైద్యారోగ్యశాఖాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్.. క్షయ, హెచ్ఐవీ నియంత్రణకు చేపడుతున్న చర్యల వివరాలు అడిగి తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతోపాటు క్షయ వంటి వ్యాధులను నివారించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ప్రతి రోజూ కనీసం రెండు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు క్షయ, హెచ్ఐవీ నిర్ధారణ కోసం విరివిగా శాంపిల్స్ సేకరించాలని సూచించారు. క్షయ నిర్మూలన కోసం ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుర్తు చేశారు. క్షయ, హెచ్ఐవీ నియంత్రణ కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సాధించిన ప్రగతిని వివరిస్తూ సమగ్ర నివేదికలు సమర్పించాలని అన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా క్షయ నియంత్రణ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ దేవినాగేశ్వరి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను ప్రోత్సహించాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి
- దశలవారీగా వెంటవెంటనే ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తాం
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- నగరంలోని పలు డివిజన్‌లలో పనుల పరిశీలన



పెయింటర్స్ కాలనీలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ సిటీ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణా అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలోని ఆయా డివిజన్‌లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌజింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లు మంజూరైన వారం దరూ వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా చూడాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారు నిర్దేశిత గడువులోగా నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో పనులు పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. అర్హులను గుర్తిస్తూ త్వరితగతిన ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టి బేస్మెంట్ లెవెల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారులు అజీజాబేగం, సమ్రిన్ సుల్తానాతో కలెక్టర్ మాట్లాడారు. ఇంటి నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ప్రశ్నించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, దశలవారీగా వెంటవెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ దుబ్బ అభయహస్తం కాలనీని సందర్శించి అసైన్డ్ భూములను పరిశీలించారు. జిల్లా హౌసింగ్ ఆఫీసర్ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



ఏఈని నిలదీస్తున్న గ్రామస్తులు

కమ్మర్‌పల్లి: విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని, వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కమ్మర్‌పల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ముట్టడించారు. లైన్‌మెన్ అప్సర్ వ్యవహార శైలిపై మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా పంటలకు నీరందడం లేదని ఏఈని నిలదీశారు. ఈదురు గాలులు, గాలివాన కారణంగా చెట్ల కొమ్మలు తీగలపై పడి ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఏఈ అన్నయ్య గ్రామస్తులు, రైతులకు వివరించారు. 11 కేవీ లైన్ ఏబీ స్విచ్‌ల కోసం, వ్యవసాయలైన్, టౌన్ లైన్ మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని, మెటీరియల్ రాగానే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు, రైతులు శాంతించారు. వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, సభ్యులు మోహన్, రాజేశ్, సామ బాలకిషన్, మాజీ ఎంపీటీసీ మైలారం సుధాకర్, నాయకులు బద్రి, సుంకరి మురళి, హరీశ్, కొంటికంటి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

- హాజరుకానున్న పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, షబ్బీర్‌అలీ, ధన్‌పాల్
- ఇంద్రపురి కాలనీలో కార్యక్రమం

నిజామాబాద్ సిటీ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ లబ్ధిదారులకు వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఆదివారం అందజేయనున్నారు. నిజామాబాద్ నగరంలోని తొమ్మిదో డివిజన్ పరిధిలో ఉన్న ఇంద్రపురి కాలనీ యదవ సంఘంలో ఉదయం 11గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌజింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొననున్నారు. తొలి విడతలో 250 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తూ ప్రొసిడింగ్స్ అందజేస్తారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్లుప్తంగా

కౌశిక్‌రెడ్డిని విడుదల చేయాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌ : ఎలాంటి నోటీసులు లేకుండా శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసిన బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు అక్రమమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ పాలన ప్రజా పాలన కాదని, రాచరిక పాలన, నియంత పాలనగా మారిందన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి జీర్ణించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌ నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడంలో ఉన్న శ్రద్ధ హామీలు అమలు చేయడంలో లేదన్నారు. తమపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొంటామని, కోర్టులపై తమకు నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటామని ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రి అడ్లూరిను కలిసి ఎమ్మెల్యే


మంత్రి లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్‌ను నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ రేకులపల్లి భూపతిరెడ్డి శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

యాదగిరిగుట్ట, స్వర్ణగిరి తీర్థయాత్ర

● ఆర్మూర్‌ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ఆర్మూర్‌టౌన్‌: భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపో ఆర్మూర్‌ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణగిరి పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు మేనేజర్‌ రవికుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 27న యాత్రకు 36 సీట్ల సామర్థ్యం గల ప్రత్యేక బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ఆర్మూర్‌ డిపో నుంచి ప్రారంభమై తిరిగి రాత్రి 10 గంటలకు ఆర్మూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ యాత్రకు ఒక్కరికి రూ.1500 ల చార్జీ ఉంటుందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన నుడా చైర్మన్‌


కలెక్టర్‌ను శాలువాతో సత్కరిస్తున్న కేశ వేణు

నిజామాబాద్‌ సిటీ: కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డిని నుడా చైర్మన్‌ కేశ వేణు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్‌ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నుడా తరఫున చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ అందజేసేందుకు ఆదివారం పీసీసీ చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ వస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో వస్తున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.


జిల్లా కోర్టులో ఆసనాలు వేస్తున్న జడ్జి, ఉద్యోగులు


రైల్వే ప్లాట్‌ఫాంపై యోగా చేస్తున్న సిబ్బంది


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌, సీపీ

నేటితరానికి యోగా నేర్పించాలి

● అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌
● అట్టహాసంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: యోగ మన ప్రాచీన సంప్రదాయం నుంచి వచ్చిన ఒక అమూల్యమైన బహుమతి అని, దానిని నేటితరానికి అందించాలని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. ఆయుష్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఎమ్మెల్యే ధన్‌పాల్‌, సీపీ సాయి చైతన్య హాజరై ఆసనాలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రోజువారీ దినచర్యలో యోగాను జోడించుకోవాలని పిలుపునిచ్చారు. యోగాను ప్రపంచదేశాలకు పరిచయం చేసిన ఘనత మన దేశానికి దక్కుతుందన్నారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ ప్రజలు నిత్యం యోగా సాధన చేయాలని, యోగా మధుమేహం, రక్తపోటు వ్యాధులను నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, జిల్లా ఆయుష్‌ నోడల్‌ అధికారి డాక్టర్‌ జే గంగాదాస్‌, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ ముక్క దేవేందర్‌ గుప్తా, డీఎంహెచ్‌వో డాక్టర్‌ రాజశ్రీ, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌ బీ, సూదం లక్ష్మి, జిల్లా లేబర్‌ ఆఫీసర్‌ యోహాను, రెడ్‌క్రాస్‌ ప్రతినిధులు బుస ఆంజనేయులు, తోట రాజశేఖర్‌, జిల్లా యోగా అసోసియేషన్‌ ప్రతినిధులు యోగా రాంచందర్‌, ప్రభాకర్‌, సంగీత, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీరామ గార్డెన్స్‌లో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆసనాలు వేస్తున్న పుర ప్రముఖులు, విద్యార్థులు

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): ఆరోగ్యంగా ఆనందమయ జీవితం గడపడానికి యోగా ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఎం యాదగిరి పేర్కొన్నారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రిజిస్ట్రార్‌ యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి, పీఆర్‌వో పున్నయ్య, యోగా గురువు సిద్ధిరామయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డిచ్‌పల్లి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డిచ్‌పల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్‌ ఏడో బెటాలియన్‌ కమాండెంట్‌ పి సత్యనారాయణ పేర్కొన్నారు. ది ఆర్ట్‌ ఆఫ్‌ లివింగ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శనివారం బెటాలియన్‌లో 11 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్‌ కేపీ శరత్‌కుమార్‌, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌ జైలులో..

నిజామాబాద్‌ లీగల్‌: నిజామాబాద్‌ సెంట్రల్‌ జైలులో సూపరింటెండెంట్‌ చింతల దశరథం ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 550 మంది ఖైదీలతో పాటు జైలు సిబ్బంది, యోగా మాస్టర్లు, పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్‌ జలందర్‌గౌడ్‌, రిటైర్డ్‌ ప్రభుత్వ ఉపాధ్యాయులు మల్లుగౌడ్‌, పి.రజితవాణి, వెంకటేశ్‌, మహేశ్‌, పతంజలి యోగా కేంద్రం సాయిలు, మాస్టర్లు ప్రభాకర్‌, జైలర్లు అనిల్‌ కుమార్‌, మన్మథరావు, డిప్యూటీ జైలర్లు అశోక్‌ కుమార్‌, నారాయణ, ఏడీజే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

నిజామాబాద్‌ లీగల్‌: జిల్లా కోర్టులో నిర్వహించిన యోగా దినోత్సవానికి ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్‌ భరతలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా యోగా గురువు అందె జీవన్‌రావుతోపాటు యోగా మాస్టర్లు సంగీత, ఎంఎస్‌ చౌదరీలు న్యాయమూర్తులు, న్యాయవాదులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మహిళా కోర్టు జడ్జి హరీశ, సీనియర్‌ సివిల్‌ జడ్జి సాయిసుధా, న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉదయ భాస్కర రావు, జూనియర్‌ సివిల్‌ జడ్జి గోపికృష్ణ, న్యాయమూర్తులు కుష్బు ఉపాధ్యాయ, శ్రీనివాస్‌ రావు, హరి కుమార్‌, పీపీ మామిడాల సుదర్శన్‌, బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజ్‌ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ విశ్వవిద్యాలయంలో..


బెటాలియన్‌లో..


జిల్లా జైలులో..

నరసన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం

నిజామాబాద్‌ సిటీ: దేశానికే అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, వారి సమస్యలు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్‌ భవన్‌లో నాయక్‌వాడి నర్సయ్య సంతాప సభ శనివారం నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ నరసన్న అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎంఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్‌ కగార్‌ పేరుతో ప్రశ్నించే వారిని, అమాయక ఆదివాసీలను, ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేస్తుందని వీటిని వెంటనే ఆపివేయాలని డిమాండ్‌ చేశారు. సీపీఐ (ఎంఎల్‌) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ నర్సయ్య మరణించేంత వరకు రైతు కూలీల సమస్యలపై ఉద్యమించాడని కొనియాడారు. అనంతరం నాయకులు వేల్పూర్‌ భూమయ్య, నీలం సాయిబాబా, దేశెట్టి సాయరెడ్డి ప్రసంగించారు. పరువయ్య, కారల్‌ మార్క్స్‌, గోపాల్‌, సాయిలు, దిగంబర్‌, పరిచూరి శ్రీధర్‌, శివకుమార్‌, రాజేశ్వర్‌, భాస్కర్‌, జీ రమేశ్‌, భారతి, సూర్య శివాజీ, ఎస్‌ దాసు, జేపీసీ గంగాధర్‌, చిన్నయ్య, దేవయ్య, సుప్రియ, నాయక్‌వాడి విజయ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వర రావు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో


మహిళా సంఘాల సభ్యులు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్‌

బోధన్‌టౌన్‌/బోధన్‌: మహిళలు వంటలతోపాటు వ్యాపార, క్రీడ, విద్యా, ఇతర సామాజిక రంగాల్లో రాణించాలని సబ్‌కలెక్టర్‌ వికాస్‌ మహతో పేర్కొన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెప్మా, బల్దియా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో శనివారం బల్దియా కార్యాలయ ఆవరణలో ఫుడ్‌ ఫెస్టివల్‌ నిర్వహిచారు. ఫుడ్‌ ఫెస్టివల్‌ను సబ్‌కలెక్టర్‌ ప్రారంభించి, మహిళా సంఘాల సభ్యులు చేసిన వివిధ వంటకాలను రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని, మహిళామణులు చేసిన వంటకాలతోపాటు పచ్చళ్లకు మార్కెటింగ్‌ కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట నారాయణ, మెప్మా టీం లీడర్‌ శ్రీనివాస్‌, తహసీల్దార్‌ విఠల్‌, బల్దియా మేనేజర్‌ రమేశ్‌, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న డీసీఎం

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామశివారు కోతి దేవుడి ఆలయం వద్ద శనివా రం అదుపుతప్పిన డీసీఎం డివైడర్‌ను ఢీకొట్టింది. నిజామాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వైపు పాత ఇనుప సామగ్రితో వెళుతున్న డీసీఎం నడిపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్‌, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎం ముందు భాగం ధ్వంసం కావడంతోపాటు టైరు ఊడిపోయింది.దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు డీసీఎంను పక్కకు తొలగించారు.ప్రమాదానికి సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయలేదని డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపారు.

బాలుడి అప్పగింత



రుద్రూర్‌ : తప్పిపోయిన బాలుడిని రుద్రూర్‌ మండల కేంద్రంలో పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పట్టణంలోని కోటగల్లికి చెందిన షేక్‌ ఫర్హాన్‌ (9) అనే బాలుడు శుక్రవారం తప్పిపోయి రుద్రూర్‌ బస్టాండ్‌ పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకొని బాన్సువాడ వాట్సాప్‌ గ్రూపులో పోస్ట్‌ చేశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు బాలుడిని అప్పగించారు.



క్రైం కార్నర్‌

అనుమానాస్పదస్థితిలో పార్ట్‌టైం లెక్చరర్‌ మృతి

● దుర్కి బాలికల గిరిజన పాఠశాలలో ఘటన


స్వప్న (ఫైల్‌)

నస్రుల్లాబాద్‌: మండలంలోని దుర్కి గ్రామంలో గల తెలంగాణ గిరిజన బాలికల రెసిడెన్షియల్‌ పాఠశాలలో పార్ట్‌టైం కెమిస్ట్రీ అధ్యాపకురాలు స్వప్న(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె సన్నిహితులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్‌ జిల్లా మోర్తాడ్‌ మండలం గాండ్లపేటకు చెందిన స్వప్న దుర్కిలోని గిరిజన గురుకుల బాలికల రెసిడెన్షియల్‌ పాఠశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. కాగా, గురువారం సూర్యాపేట్‌ జిల్లా కోదాడలో టెట్‌ రాసిన స్వప్న, శుక్రవారం విధులకు హాజరైంది. రోజంతా పని చేసినా రాత్రి డ్యూటీ వేశారు. దీంతో రాత్రి పిల్లలను చదివించి నిద్రపోయింది. విద్యార్థినులు ఎంత లేపినా లేవకపోవడంతో సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నామని ఎస్సై లావణ్య తెలిపారు. ఇదిలా ఉండగా స్వప్నకు ఆరోగ్యం బాగోలేక పోయినా ప్రిన్సిపల్‌ డ్యూటీ వేసి పని ఒత్తిడి కల్పించి ఉండొచ్చని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి వృద్ధులైన తల్లిదండ్రులు, ఇంటర్‌ చదివే తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కైన కూతురు మరణించడంతో బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ యువకుడు..


హరి(ఫైల్‌)

ఇందల్వాయి: గన్నారం గ్రామానికి చెందిన నాగుల హరి(22) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగిన హరిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా శనివారం మరణించాడు. హరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతుడు టోల్‌ప్లాజా వద్ద ఫాస్ట్‌ టాగ్‌లు విక్రయిస్తుండేవాడని తెలిపారు. తండ్రి దేవేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

బాన్సువాడ : బాన్సువాడ నాగయ్య చెరువులో దూకి కొండని గంగవ్వ(70) ఆత్మహత్యకు పాల్పడింది. పాత బాన్సువాడ గూడెంగల్లీకి చెందిన గంగవ్వ అనారోగ్యంతో బాధపడుతోంది. గంగవ్వ కుమారుడు రాజు తన అత్తగారి ఊరైన దేశాయిపేట్‌లో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. గంగవ్వ మాత్రం బాన్సువాడలోనే ఉంటుంది. వారం రోజుల క్రితం నుంచి గంగవ్వ కుమారుడు, కోడలు వచ్చి గంగవ్వ ఇంట్లోనే ఉంటున్నారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన గంగవ్వ సాయంత్రం చెరువులో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ **Wanted Teachers for Higher** Classes Fluency in English is Essential Interested Contact Immediately St. Xaviers High School, Opp: forest Office, Varni Road, Nizamabad. 8639189010. [Z-7143]

FACULTY TEACHERS

■ **Wanted Computer DCA** - Tally Teaching Faculty, Spoken English & Soft Skills, Lab Asst., Office boy, sweeper. Cont: DDU Gky Centre. Ph. 9014569553. [SCA25005239]

■ **Wanted pre primary Primary** & High School E/M Teachers for all Subjects, Cont: 63034 48220, 98489 90533. [SCA25004406]

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/- రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతివకు అండగా మహిళా ప్రాంగణం

మీకు తెలుసా?


ఆర్మూర్‌ పట్టణం పెర్కిట్‌ శివారులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ మహిళా ప్రాంగణం

ఆర్మూర్‌ పట్టణం పెర్కిట్‌ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం అనాథ, విధి వంచిత మహిళలకు 37 ఏళ్లుగా అండగా నిలుస్తోంది.

- ఆంధ్రప్రదేశ్‌ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చేయూతనందించేందుకు అప్పటి సీఎం నందమూరి తారక రామారావు 1988 సంవత్సరంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.
- 11.66 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.
- ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలు శక్తివంతులు కావడానికి ప్రాంగణంలో వివిధ వృత్తి విద్యా కోర్సులను ఏర్పాటు చేశారు.
- 1997లో బాల కార్మికుల పునరావాస కార్యక్రమంలో భాగంగా బాలికల రెసిడెన్షియల్‌ బ్రిడ్జి పాఠశాలను ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- చదువు మానేసిన, పనిలోకి వెళ్లే, అనాథ పిల్లలను గుర్తించి 776 మందిని చేరదీశారు.
- ఇప్పటి వరకు ప్రాంగణంలో 33 వృత్తి విద్యా కోర్సుల్లో వేల సంఖ్యలో మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- 2001 సంవత్సరంలో అంగన్‌వాడీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు శిక్షణనిస్తున్నారు.
- మహిళా ఆరోగ్య కార్యకర్తలకు 2005 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

– ఆర్మూర్‌

ప్రజా సేవ కోసమే పదవులు

● రాజ్యసభ సభ్యుడు కేఆర్‌ సురేశ్‌ రెడ్డి


సురేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈరవత్రి రాజశేఖర్‌

ఆర్మూర్‌ : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో భాగంగా పదవులు వస్తాయని, ఆ పదవులను ప్రజాసేవకు వినియోగించాలని రాజ్యసభ సభ్యుడు, మాజీ స్పీకర్‌ కేఆర్‌ సురేశ్‌ రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్‌ పరిధిలోని బాలాజీ ఫంక్షన్‌ హాల్‌లో ఇటీవల రైల్వే బోర్డు, టెలికాం శాఖ డైరెక్టర్లుగా నామినేట్‌ అయిన బొడ్డు గంగాధర్‌, సాయి రెడ్డి, ప్రసాద్‌ గౌడ్‌, తాజుద్దీన్‌, మోహన్‌, భాస్కర్‌, మంథని అజయ్‌, సింగిడి మోహన్‌ రెడ్డిలకు నియామకపత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు, చార్టెడ్‌ అకౌంటెంట్‌ రాజశేఖర్‌ తమ బృందంతో కలిసి కేఆర్‌ సురేశ్‌ రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జ దత్తాద్రి, నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దాసరి సునీల్‌, గంగామోహన్‌ చక్రు, అర్గుల్‌ సురేశ్‌, రాంప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కేంద్రం కృషి

● బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌


మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్‌

సుభాష్‌నగర్‌: దేశంలోని దళితుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ పేర్కొన్నారు. నగరంలోని గౌతమ్‌నగర్‌లో శనివారం ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్‌ శివప్రసాద్‌ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌ మాట్లాడుతూ కేంద్రం దళితుల అభివృద్ధికి కృషి చేస్తూనే, భారత రాజ్యాంగాన్ని కాపాడుతోందని తెలిపారు. రాజ్యాంగ విలువలను ప్రపంచానికి తెలియజేసేలా ప్రధాని మోదీ పాటుపడుతున్నారన్నారు. అంబేడ్కర్‌ ఆలోచనలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాజీపేట శివాజీ, పాతనేకర్‌ లక్ష్మీనారాయణ, సందీప్‌, సాయిరాం, కెప్టెన్‌ రాజు, ప్రతాప్‌, బాలకృష్ణ, రంజిత్‌ పాల్గొన్నారు.

కార్పొరేట్‌ కంపెనీలకు కేంద్రం ఊడిగం


వేదికపై నినాదాలు చేస్తున్న టీయూసీఐ జాతీయ, రాష్ట్ర నేతలు

● టీయూసీఐ జాతీయ అధ్యక్షుడు అభ్రిష్‌ పటేల్‌

నిజామాబాద్‌ సిటీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్‌ కంపెనీలకు అప్పగిస్తూ అదానీ, అంబానీ, టాటాలకు ఏజెంట్‌గా కార్పొరేట్‌ కంపెనీలకు ఊడిగం చేస్తోందని ట్రేడ్‌ యూనియన్‌ సెంటర్‌ ఆఫ్‌ ఇండియా (టీయూసీఐ) జాతీయ అధ్యక్షుడు అభ్రిష్‌ పటేల్‌ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన టీయూసీఐ రాష్ట్ర తొలి మహాసభలకు ఆయన హాజరై ప్రసంగించారు. ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి, ఓట్లు సీట్లు దండుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రశ్నించిన వారిపై దేశ ద్రోహులని ముద్రవేస్తూ, ప్రజాస్వామ్యవాదు లను నిర్బంధిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కార్మికోద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వనమాల కృష్ణ, కే సూర్యం మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు రూ. 26 వేలు, పెన్షన్‌ రూ. 9వేలు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటిత, అసంఘటిత కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. అంతకు ముందు రాజీవ్‌ గాంధీ ఆడిటోరియం నుంచి పాత కలెక్టరేట్‌ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎం నరేందర్‌, ఎస్‌ఎల్‌ పద్మ, ఎం.హన్మేష్‌, కే రాజన్న, రామయ్య, సీ వెంకటేశ్‌, ముస్కె సుధాకర్‌, వెంకన్న, రాజేశ్వర్‌, ముత్తన్న మల్లేశ్‌, యాకూబ్‌ షావలి, వెంకట్‌ రెడ్డి, అశోక్‌, సాంబశివుడు, కిరణ్‌, ప్రసాద్‌, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొన్న మహిళలు

అటవీశాఖ అధికారులపై గిరిజనుల దాడి

నిందితుల రిమాండ్‌


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌

ఇందల్వాయి: అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళ అటవీ భూములను చదును చేస్తున్న గిరిజనులను ఆపబోతే ఎదురు తిరిగి అటవీశాఖ అధికారుల మీద దాడి చేసిన ఘటన ధర్పల్లి మండలం కొటాల్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎఫ్‌ఆర్‌వో రవి మోహన్‌ భట్‌, ధర్పల్లి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి రిజర్వ్‌ ఫారెస్ట్‌ కొటాల్‌పల్లి బీట్‌ పరిధిలోని కంపార్ట్‌మెంట్‌-593లో కొందరు గిరిజనులు చెట్లను నరికి అటవీ భూమిని చదును చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్షన్‌ అధికారి భాస్కర్‌, బీట్‌ ఆఫీసర్లు ఉదయ్‌, ప్రవీణ్‌, ఖదీర్‌ సిబ్బందితో వెళ్లి భూమిని చదును చేస్తున్న గిరిజనులను అడ్డుకొని ట్రాక్టర్‌ను రేంజ్‌ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన బూక్య నవీన్‌, బాదావత్‌ పూల్‌సింగ్‌, బూక్య మధు, బూక్య సంగ్య తదితరులు అధికారులపై పొడికారం చల్లి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం అధికారుల నుంచి ట్రాక్టర్‌ని లాక్కొని వెళ్లారు. ఘటనపై శనివారం ధర్పల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ, సిబ్బందితో కలిసి కొటాల్‌పల్లికి వెళ్లి నిందితులను పట్టుకొని రిమాండ్‌కి తరలించారు. ట్రాక్టర్‌ని సీజ్‌ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. దాడిలో పాల్గొన్న మిగితా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ వివరించారు.

నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి

ఖలీల్‌వాడి: రైలులో సెల్‌ఫోన్లను దొంగతనం చేసిన యువకుడిని అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్‌ రైల్వే స్టేషన్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో సిబ్బంది ఒకటో నంబర్‌ ప్లాట్‌ఫాం మీద విధులు నిర్వహిస్తుండగా ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరగడంతో పట్టుకొని విచారించారు. నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన సయ్యద్‌ మాజీద్‌ (27)గా గుర్తించారు. ఈ నెల 19న నాగర్‌సోల్‌, షిర్డీ సాయినగర్‌ రైలులో మూడు సెల్‌ఫోన్లను దొంగిలించినట్లు చెప్పారు. సెల్‌ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. దొంగను పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్‌ సురేందర్‌, గురువాస్‌, కానిస్టేబుల్‌ రాములును ఎస్సై అభినందించారు.